నేటి మ్యాచులు | భారత్ X ఐర్లాండ్ న్యూయార్క్ - రా. 8.00

అఫ్గాన్ అలవోకగా

ఉగాండా ఘోర పరాజయం • రాణించిన గుర్బాజ్, జద్రాన్, ఫరూఖీ

గయానా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న అఫ్గానిస్థాన్ టీ20 ప్రపంచకప్‌ను ఘనంగా ఆరంభించింది. గ్రూప్-సీలో ఉన్న అఫ్గాన్.. గయానాలోని ప్రావిడెన్స్ స్టేడియం వేదికగా ఉగాండాతో జరిగిన మ్యాచ్‌లో 125 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. తొలిసారి ఐసీసీ టోర్నీ ఆడుతున్న ఉగాండా కనీసం పోటీని కూడా ఇవ్వలేదు. టాస్ గెలిచి ప్రత్యర్థికి బ్యాటింగ్ అప్పగించిన ఉగాండా అందుకు తగ్గ మూల్యమే చెల్లించుకుంది. అంతగా అనుభవం లేని ఉగాండా బౌలర్లపై అఫ్గాన్ ఓపెనర్లు గుర్బాజ్ (45 బంతుల్లో 76, 4 ఫోర్లు, 4 సిక్సర్లు), ఇబ్రహీం జద్రాన్ (46 బంతుల్లో 70, 9 ఫోర్లు, 1 సిక్స్) భారీ షాట్లతో విరుచుకుపడి తొలి వికెట్‌కు 14.3 ఓవర్లలోనే ఏకంగా 154 పరుగులు జోడించారు. ఈ ఇద్దరి దూకుడుతో అఫ్గాన్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 183 పరుగులు సాధించింది.

అనంతరం ఛేదనకు దిగిన ఉగాండా తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు కోల్పోయి ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. అఫ్గాన్ పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీ (5/9) ఐదు వికెట్లతో విజృంభించడంతో ఆ జట్టు విలవిల్లాడింది. ఫరూఖీకి తోడు నవీనుల్ హక్ (2/4), రషీద్ ఖాన్ (2/12) రాణించడంతో ఉగాండా 16 ఓవర్లలో 58 పరుగులకే ఆలౌట్ అయింది. ఆ జట్టులో రాబిన్సన్ ఒబుయా (14) టాప్ స్కోరర్. రియాజత్ (11) మినహా మిగిలిన బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. నలుగురు బ్యాటర్లు డకౌట్ అయ్యారు.

ఫరూఖీ (5/9)

గుర్బాజ్ (76)
జద్రాన్ (70)

2 అఫ్గానిస్థాన్ తరపున టీ20లలో ఒక బౌలర్ ఐదు వికెట్లు తీయడం ఇది రెండోసారి. గతంలో ఈ రికార్డు రషీద్ ఖాన్ (5/3) పేరిట ఉంది. పొట్టి ప్రపంచకప్‌లో అయితే అఫ్గాన్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. 2021 టీ20 వరల్డ్ కప్‌లో ముజీబ్ స్కాట్లాండ్‌పై (5/20) ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు.

4 టీ20 ప్రపంచకప్‌లో ఇది నాలుగో అత్యల్ప స్కోరు. నెదర్లాండ్స్ (39, 44), వెస్టిండీస్ (55) ముందున్నాయి.

సంక్షిప్త స్కోర్లు:
అఫ్గానిస్థాన్: 20 ఓవర్లలో 183/5 (గుర్బాజ్ 76, జద్రాన్ 70, మసబ 2/21, కొస్మస్ 2/25). ఉగాండా: 16 ఓవర్లలో 58 ఆలౌట్ (ఒబుయా 14, రియాజత్ 11, ఫరూఖీ 5/9, నవీనుల్ 2/4)

లక్ష్యసేన్, గాయత్రి ద్వయం ముందంజ

ఇండోనేషియా ఓపెన్

జకర్తా: ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్‌లో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, ప్రియాన్షు రజావత్ ముందంజ వేయగా కిరణ్ జార్జి, హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టారు. మహిళల డబుల్స్‌లో త్రిసా-గాయత్రి ద్వయం రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. లక్ష్యసేన్.. 21-12, 21-17తో త్సునెయమను ఓడించగా రజావత్.. 21-17, 21-12తో ప్రణయ్‌ను చిత్తుచేశాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో గాయత్రి జంట.. 21-15, 21-11 తో యు పి చెంగ్-యు పి హ్సింగ్ సన్‌ను మట్టికరిపించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్ రెడ్డి- సిక్కి రెడ్డి.. 18-21, 21-16, 21-17తో విన్సన్ చివు - జెన్నీ గయ్ (అమెరికా)పై విజయం సాధించారు.

బోపన్నకు జోడీగా బాలాజీ



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న పారిస్ ఒలింపిక్స్‌లో తనతో కలిసి ఆడబోయే సహచర ఆటగాడిగా శ్రీరామ్ బాలాజీని ఎంచుకున్నాడు. ఈ మేరకు అతడు ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ (ఐటా)కు మెయిల్ చేసినట్టు మంగళవారం వెల్లడించగా ఐటా సైతం దీనిని ధృవీకరించింది. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న బాలాజీ.. మూడు రోజుల క్రితమే ఫ్రెంచ్ ఓపెన్ ప్రిక్వార్టర్స్‌లో మెక్సికన్ ఆటగాడు రేయెస్-వరెలతో కలిసి బోపన్న - ఎబ్డెన్ జోడీకి గట్టి పోటీనిచ్చాడు. బోపన్నకు సహచరుడిగా యూకీ బాంబ్రీ సైతం పోటీలో నిలిచినా అతడు మాత్రం బాలాజీ వైపునకే మొగ్గుచూపాడు.

ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు

రాణించిన స్కాట్లాండ్ ఓపెనర్లు • వర్షం కారణంగా ఫలితం తేలని మ్యాచ్

బార్బడోస్: డిఫెండింగ్ చాంపియన్ హోదాలో టీ20 వరల్డ్ కప్ బరిలో నిలిచి బోణీ కొట్టాలనుకున్న ఇంగ్లండ్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. పలుమార్లు వర్షం అంతరాయం కలిగించడంతో 10 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ దంచికొట్టింది. ఓపెనర్లు జార్జ్ మున్సె (31 బంతుల్లో 41 నాటౌట్, 4 ఫోర్లు, 2 సిక్సర్లు), మైఖెల్ జోన్స్ (30 బంతుల్లో 45 నాటౌట్, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడటంతో ఆ జట్టు 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 90 పరుగులు చేసింది. మార్క్ వుడ్, ఆర్చర్, మోయిన్ అలీ, క్రిస్ జోర్డాన్, అదిల్ రషీద్ వంటి అనుభవజ్ఞులైన బౌలర్లు ఉన్న ఇంగ్లండ్.. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయింది.

టాస్ తర్వాత వర్షం కురవడంతో మ్యాచ్ సుమారు గంట సేపు ఆలస్యంగా ఆరంభమైంది. ఆ తర్వాత ఆట మొదలైనా 6.2 ఓవర్ల వద్ద వరుణుడు మరోసారి అంతరాయం కలిగించాడు. దాదాపు రెండు గంటల తర్వాత ఆట ప్రారంభమైనా అంపైర్లు మ్యాచ్‌ను 10 ఓవర్లకు కుదించారు. ఇంగ్లండ్ లక్ష్యం 10 ఓవర్లలో 109 గా నిర్ణయించగా వర్షం మరోసారి కురవడంతో అంపైర్లు ఆటను రద్దు చేశారు. దీంతో ఇరు జట్లకు చెరొక పాయింట్ దక్కింది.

జోన్స్ (45*)

మరో రెండడుగులే

సెమీస్ చేరిన స్వియాటెక్, కోకో గాఫ్.. పురుషుల సింగిల్స్‌లో సిన్నర్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో పోలండ్ బ్యూటీ ఇగా స్వియాటెక్ జోరు కొనసాగుతోంది. ఈ టోర్నీలో హ్యాట్రిక్ టైటిల్‌పై కన్నేసిన ఆమె లక్ష్యానికి మరో రెండడుగుల దూరంలో నిలిచింది. మంగళవారం ఫిలిప్పి చాట్రియర్ వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఒకటో సీడ్ స్వియాటెక్.. 6-0, 6-2తో మర్కెట వొండ్రుసోవా (చెక్)ను వరుస సెట్లలో ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లింది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఈ పోరును గంటా 2 నిమిషాల్లోనే ముగించిన డిఫెండింగ్ చాంపియన్.. సెమీస్‌లో అమెరికా అమ్మాయి కోకో గాఫ్‌తో తలపడనుంది. మరో క్వార్టర్స్‌లో గాఫ్.. 4-6, 6-2, 6-3తో 8వ సీడ్ ఒన్స్ జబేర్ (ట్యూనిషియా)ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో ఇటలీ కుర్రాడు జన్నిక్ సిన్నర్.. 6-2, 6-4, 7-6 (7/3)తో దిమిత్రోవ్ (బల్గేరియా)ను చిత్తు చేసి సెమీస్ లోకి ప్రవేశించాడు.



గాయంతో జొకో ఔట్

25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) ఫ్రెంచ్ ఓపెన్ నుంచి అర్ధాంతరంగా తప్పుకున్నాడు. కుడి మోకాలి గాయం కారణంగా నొవాక్ ఈ టోర్నీ నుంచి వైదొలుగుతున్నట్టు ఫ్రెంచ్ ఓపెన్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. కొన్నివారాలుగా మోకాలి నొప్పి వేధిస్తున్నా తగు జాగ్రత్తలతో ఈ టోర్నీ బరిలోకి దిగిన సెర్బియా స్టార్.. రెండ్రోజుల క్రితం ఫ్రాన్సిస్కో సెరున్‌డొలొపై సుమారు నాలుగున్నర గంటల పాటు జరిగిన హోరాహోరి మ్యాచ్‌లో పలుమార్లు గాయంతో ఇబ్బందిపడ్డాడు. మ్యాచ్ ముగిశాక జొకోకు నిర్వహించిన ఎంఆర్‌ఐ స్కాన్‌లో గాయం తీవ్రత ఎక్కువుండటంతో అతడు టోర్నీలో కొనసాగకూడదని నిర్ణయించుకున్నాడు. దీంతో క్వార్టర్స్‌లో అతడితో తలపడాల్సిన కాస్పర్ రూడ్.. సెమీస్ చేరాడు.

గెలుపు దిశగా నెదర్లాండ్స్

106 పరుగులకే నేపాల్ ఆలౌట్


ప్రింగిల్ (3/20)

డల్లాస్: బౌలర్ల సమిష్టి ప్రదర్శనతో నేపాల్‌తో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ గెలుపు దిశగా సాగుతోంది. డల్లాస్‌లోని గ్రాండ్ ప్రియారి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్.. డచ్ బౌలర్ల ధాటికి 19.2 ఓవర్లలో 106 పరుగులకే ఆలౌట్ అయింది. నేపాల్ సారథి రోహిత్ పౌడెల్ (35), గుల్షన్ ఝా (14) ఫర్వాలేదనిపించగా మిగిలిన బ్యాటర్లంతా చేతులెత్తేశారు. డచ్ బౌలర్లలో వాన్ బీక్ (3/18), టిమ్ ప్రింగిల్ (3/20), వాన్ మికెరెన్ (2/19), బస్ డి లిడె (2/22) సమిష్టిగా విజృంభించడంతో నేపాల్ విలవిల్లాడింది. స్వల్ప ఛేదనలో నెదర్లాండ్స్.. కడపటి వార్తలందేసరికి 14 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసి గెలుపు దిశగా సాగుతోంది.

పఠాన్ సిక్సర్

అధీర్ రంజన్ చౌదరిపై ఘనవిజయం

కృతి ఆజాద్, ప్రసూన్ బెనర్జీ జయకేతనం

న్యూఢిల్లీ: గతంలో భారత్‌కు క్రీడల్లో ప్రాతినిధ్యం వహించి లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన క్రీడాకారుల్లో పలువురు సత్తాచాటారు. భారత మాజీ ఆల్‌రౌండర్, 'సిక్సర్ల వీరుడి'గా గుర్తింపు పొందిన యూసుఫ్ పఠాన్.. తొలి ప్రయత్నంలోనే భారీ సిక్సర్ కొట్టాడు. పశ్చిమబెంగాల్‌లోని బరంపుర నియోజకవర్గం నుంచి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తరపున బరిలో ఉన్న యూసుఫ్.. తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ లోక్‌సభ పక్ష నేత అధీర్ రంజన్ చౌదరిపై 85 వేల మెజారిటీతో జయకేతనం ఎగురవేశాడు. వరుసగా 5 సార్లు గెలిచిన అధీర్‌కు 25 ఏండ్ల తర్వాత ఓటమి రుచి చూపించాడు. టీఎంసీ నుంచే బరిలో ఉన్న మరో మాజీ క్రికెటర్, 1983 వన్డే వరల్డ్ కప్ జట్టులో సభ్యుడైన కృతి ఆజాద్.. (దుర్గాపూర్) వెస్ట్ బెంగాల్ బీజేపీ చీఫ్ దిలీప్ ఘోష్‌పై లక్షా 37 వేలకు పైగా మెజారిటీతో గెలుపొందాడు. అదే పార్టీకి చెందిన మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు ప్రసూన్ బెనర్జీ.. హౌరాలో ఘనవిజయం సాధించాడు. బీజేపీ తరపున బరిలో నిలిచిన పారా అథ్లెట్ దేవేంద్ర ఝఝూరియా (చురు), సుందర్‌గఢ్ (ఒడిశా)లో బిజూ జనతాదళ్ అభ్యర్థి అయిన హాకీ మాజీ సారథి దిలీప్ టిర్కీకి నిరాశే ఎదురైంది.

• గ్రూప్-1 పరీక్షపై రోజుకో నిబంధన

హైదరాబాద్, జూన్ 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈనెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష హాల్‌టికెట్లలో కొత్త నిబంధనలు తీసుకువస్తున్నారు. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ఈ నెల 1 నుంచే ప్రారంభమైంది. అప్పుడు హాల్‌టికెట్‌పై అభ్యర్థి పాస్‌పోర్టు ఫొటో అతికించాలని చెప్పలేదు. మూడు రోజుల తర్వాత హాల్‌టికెట్‌పై ఫొటో అతికించాలని టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఇలా రోజుకో నిబంధన పెడుతూ అభ్యర్థులను అయోమయానికి గురి చేస్తుంది. దీంతో అభ్యర్థులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీకి పలుసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, పట్టించుకోకుండా పరీక్షలు నిర్వహించడంపై మండిపడుతున్నారు.

• నేడు పీఈసెట్ హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్) హాల్‌టికెట్లు బుధవారం విడుదలకానున్నాయి. అభ్యర్థులు https://pecet.tsche.ac. in వెబ్‌సైట్‌ను సంప్రదించి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్ తెలిపారు. ఈనెల 10 నుంచి 13 వరకు ఉదయం 6:30 నుంచి కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీలో ఫిజికల్ ఫిట్‌నెస్ అండ్ స్కిల్ టెస్టులను నిర్వహిస్తామని పేర్కొన్నారు. పురుషులకు ఈ నెల 10, 11 తేదీల్లో, మహిళలకు 12, 13న టెస్టులు ఉంటాయని తెలిపారు.

శ్రేయాస్ జోసెఫ్

సందీప్ చౌదరి

రిషబ్ షా

ఆదిత్య కుమార్

శశాంక్ శర్మ

ఇషా కొటారి

ప్రచిత

దర్శ్ పగ్దార్

• నీట్‌లో నారాయణ విజయపరంపర!

720/720 మార్కులతో ఆలిండియా • ఓపెన్ క్యాటగిరీలో 8 ఫస్ట్ ర్యాంకులు

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-2024 ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో తమ విద్యార్థులు విజయ దుందుభి మోగించినట్టు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పీ సింధూర నారాయణ, పీ శరణి నారాయణ తెలిపారు. 720/720 మార్కులతో ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో సామ్ శ్రేయాస్ జోసెఫ్, కే సందీప్‌చౌదరి, షాహ్, పీ ఆదిత్యకుమార్, శశాంక్‌శర్మ, ఈషా కొఠారి, ప్రాచిత, దర్శ్ పగ్‌దార్ (ఎనిమిది మంది) ఫస్ట్ ర్యాంకులు సాధించినట్టు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 715 మార్కులు సాధించినవారిలో13 మంది, 710 మార్కులు మార్కులు సాధించిన వారిలో 20 మంది నారాయణ విద్యార్థులు ఉన్నారని వివరించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందాలకు డైరెక్టర్ సింధూర నారాయణ అభినందలు తెలిపారు.

• చంద్రిక అవినాష్‌కు మిస్సెస్ వరల్డ్ పీస్ కిరీటం

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 4: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ చంద్రిక అవినాష్ ప్రతిష్ఠాత్మకమైన మిస్సెస్ వరల్డ్ పీస్-2024 అందాల పోటీల్లో రాణించి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. హర్యానా రాష్ట్రంలోని గుర్‌గావ్‌లో గ్లామర్ గుర్‌గావ్ సంస్థ ద్వారా మే 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా ఫైనల్స్‌కు చేరుకున్న 140 మంది పోటీదారులలో చంద్రిక అవినాష్ అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి మిస్సెస్ ఇంటలెక్చువల్ సబ్ టైటిల్, మిస్సెస్ వరల్డ్ పీస్ కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనను అనునిత్యం ప్రోత్సహించి ధైర్యాన్నిచ్చిన తన భర్త డాక్టర్ అవినాష్, అత్త దేవీబాయి, స్నేహితులు, శ్రేయోభిలాషులు, సోషల్ మీడియా ఫాలోవర్స్‌కు ఈ అవార్డును అంకితం ఇస్తున్నట్టు ప్రకటించారు. తన గురువు మెంటర్, గ్లామర్ గుర్‌గావ్ డైరెక్టర్ బార్థ నాంగియా ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ చంద్రిక అవినాష్

ఇంటర్న్‌షిప్‌ల బాటలో ఇంజినీరింగ్ కాలేజీలు

- విద్యార్థులకు తప్పనిసరి చేస్తున్న విద్యాసంస్థలు
- మారుతున్న ఇంజినీరింగ్ కోర్సుల బోధన ట్రెండ్

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ) : ఇంటర్న్‌షిప్ ద్వారా చదువుకొంటూనే పరిశ్రమల పనితీరును తెలుసుకోవడం.. నైపుణ్యాలను ఆర్జించవచ్చు. ఇలాంటి ఇంటర్న్‌షిప్‌ను ఇటీవలికాలంలో విద్యాసంస్థలు, కాలేజీలు విరివిగా ప్రోత్సహిస్తున్నాయి. విద్యార్థులు కూడా ఉత్సాహంగా ఇంటర్న్‌షిప్‌లలో చేరుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ అన్న తేడాల్లేకుండా పలు ప్రతిష్ఠాత్మక సంస్థలు ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పిస్తున్నాయి. కొన్ని సంస్థలు సొంతంగా విద్యార్థులే వెతుక్కోవాలని సూచిస్తుండగా, మరికొన్ని నిర్దేశిత రంగంలో, నిర్దేశిత కంపెనీలోనే ఇంటర్న్‌షిప్‌ను ప్రోత్సహిస్తున్నాయి. మన దగ్గర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన డీఆర్‌డీవో, బీహెచ్‌ఈఎల్, ఐటీ కంపెనీలు, బిట్స్ విద్యాసంస్థలు ఇంటర్న్‌షిప్‌ను అమలుచేస్తున్నాయి.

అన్ని కోర్సుల్లో ఇంటర్న్‌షిప్

మా కాలేజీలో అన్ని కోర్సుల్లో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరిగా అమలుచేస్తున్నాం. మొదటి సంవత్సరంలో ఫీల్డ్ వర్క్ ఉంటుంది. ఆ తర్వాత ఆరు సెమిస్టర్‌లలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పిస్తున్నాం. విద్యార్థులు నాలుగు వారాల పాటు ఇంటర్న్‌షిప్ చేస్తారు. మా కాలేజీ విద్యార్థి ఒకరు మలేషియా యూనివర్సిటీలో 6 నెలల పాటు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీ హబ్ సహాయాన్ని పొందుతున్నారు. విద్యార్థులు బీహెచ్‌ఈఎల్, డీఆర్‌డీవో వంటి ప్రతిష్ఠాత్మక కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌లు చేస్తున్నారు. ఇంటర్న్‌షిప్ చేసినందుకు ఆర్థిక సహాయాన్ని పొందుతున్నారు.

– డాక్టర్ లత, సీఎస్‌ఈ ప్రొఫెసర్, స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ

ఇంటర్న్‌షిప్ చేస్తే ఒక క్రెడిట్

మాది అటానమస్ కాలేజీ. మా కాలేజీలో మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్‌ను అమలుచేస్తున్నాం. దీని వ్యవధి 3 నుంచి 6 నెలల పాటు ఉంటుంది. మా కాలేజీ విద్యార్థి ఒకరికి అమెజాన్ కంపెనీలో ఇంటర్న్‌షిప్ లభించింది. ఆ విద్యార్థికి రూ.లక్ష పారితోషికం లభిస్తున్నది. ఇంటర్న్‌షిప్ చేసిన వారికి ఒక క్రెడిట్‌ను జారీచేస్తున్నారు. ఈ క్రెడిట్‌ను విద్యార్థులు పాస్ కోసం వినియోగించుకోవచ్చు. కొందరు విద్యార్థులు వారే ఇంటర్న్‌షిప్‌లను వెతుక్కొంటున్నారు. దీని ద్వారా వారి కాళ్లమీద వాళ్లు నిలబడగలిగే సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చు.

– ప్రొఫెసర్ కీర్తి, సీఎస్‌ఈ విభాగం, గీతాంజలి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ

మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్ దిగువ ప్రాంతంలో జరుగుతున్న కాపర్ షీట్‌ఫైల్స్ పనులు

అన్నారం వద్ద గ్రౌటింగ్ పనులు ప్రారంభం

కాళేశ్వరం/మహదేవపూర్, జూన్ 4: కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం (సరస్వతీ) బరాజ్‌లో గ్రౌటింగ్ పనులు ప్రారంభమయ్యాయి. బరాజ్‌లో డౌన్ స్ట్రీమ్‌లోని 38వ పిల్లర్ గేట్ వద్ద జరుగుతున్న పనులు వర్షం కారణంగా సోమవారం ఆగిపోయాయి. మంగళవారం వర్షం లేకపోవడంతో పనులు మొదలుపెట్టారు. నీరు లీకు కాకుండా ఉన్నంత వరకు పనులు చేయనున్నట్టు ఇంజినీర్లు తెలిపారు.

'మేడిగడ్డ'లో మరమ్మతు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనల మేరకు బరాజ్‌లో కుంగిన 19, 20, 21వ పియర్ల వద్ద అప్, డౌన్ స్ట్రీమ్‌లలో పనులు చేస్తున్నారు. మంగళవారం భారీ నీటి పారుదల శాఖ ఈఈ తిరుపతి రావు ఈ పనులను పరిశీలించారు. బరాజ్ ఏడో బ్లాక్‌లోని 18, 19వ పిల్లర్ల వద్ద ఏర్పడ్డ ఖాళీ ప్రదేశాలను సిమెంట్, ఇసుక మిశ్రమంతో కెమికల్ గ్రౌటింగ్ పనులు చేపడుతున్నారు. 15,16వ పిల్లర్ల దిగువన ఇసుకలో కాపర్ షీట్ ఫైల్స్‌ను అమర్చుతున్నారు. 20, 21వ గేట్ల కటింగ్, డౌన్ స్ట్రీమ్‌లో క్రేన్‌ల సాయంతో సీసీ బ్లాక్‌లను తీసి అమర్చుతున్నారు.

నీట్‌లో అనురన్ ఘోష్‌కు ఆలిండియా 77వ ర్యాంకు

- ఎస్టీ కోటాలో టాప్ 2 ర్యాంకులు మనోళ్లవే
- నీట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): నీట్ (యూజీ) ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులతో ఆలిండియా టాపర్లుగా నిలిచారు. వీరిలో ఒక్కరు కూడా తెలంగాణ వారు లేకపోవడం గమనార్హం. రాష్ట్రానికి చెందిన విద్యార్థి అనురన్ ఘోష్ 99.996614 పర్సంటైల్‌తో ఆలిండియా 77వ ర్యాంకును కైవసం చేసుకొన్నాడు. ఇక ఎస్టీ కోటాలో గుగులోత్ వెంకట నృపేష్ ఆలిండియా మొదటి ర్యాంకును, లావుడ్యా శ్రీరామ్‌నాయక్ ఆలిండియా రెండో ర్యాంకును పొందారు. వీరు ఓపెన్ కోటాలోనూ ఉత్తమ ర్యాంకులు సాధించారు. గుగులోత్ వెంకట నృపేష్ ఆలిండియా 167 ర్యాంకు, లావుడ్యా శ్రీరామ్‌నాయక్ ఆలిండియా 453 ర్యాంకును కైవసం చేసుకోవడం విశేషం. దేశవ్యాప్తంగా వైద్యవిద్యాకోర్సుల్లో ప్రవేశాలకు ఈ ఏడాది 24,06, 079 మంది విద్యార్థులు నీట్‌కు రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. వీరిలో 23,33,297 మంది పరీక్ష రాయగా, 13,16,268 మంది విద్యార్థులు అర్హత సాధించారు. అయితే నిరుడు తెలంగాణ నుంచి 58శాతం విద్యార్థులే క్వాలిఫై కాగా, ఈ ఏడాది 60 శాతం విద్యార్థులు అర్హత సాధించారు.

తెలంగాణ నుంచి అర్హులైన వారు

	2024	2023
దరఖాస్తుదారులు	79,813	73,883
హాజరైనవారు	77,849	72,842
అర్హులైనవారు	47,371	42,654
శాతం	60.84%	58.55%

మార్కులు సాధించిన వారి వివరాలు

మార్కులు	అభ్యర్థులు
720-164	11,65,904
163-129	1,00,769
163-129	34,326
163-129	14,478
163-146	455
145-129	270
145-129	55
145-129	11

నీట్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 4: నీట్-24 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఉత్తమ ర్యాంకులు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ఫోర్స్ ఐఐటీ, నీట్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ చూపడం తమకు గర్వంగా ఉందని చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్ హేమంత్ 720 మార్కులకు 691 మార్కులు సాధించాడని పేర్కొన్నారు. వీ హాసిని 671, పూజిత 650, ఎన్ కౌశిక్‌రెడ్డి 647, పీ అక్షరరెడ్డి 639 మార్కులు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. మరో 87 మంది విద్యార్థులు 450కిపైగా మార్కులు సాధించి అల్ఫోర్స్‌లో నూతన శకానికి నాంది పలికారని చెప్పారు. ఈ విజయానికి కారణమైన అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ-సైకిల్ భళా

- 20 వేల ఖర్చుతో బ్యాటరీతో నడిచే సైకిల్ తయారు చేసిన యువకుడు
- 2 గంటలు చార్జింగ్ పెడితే 30 కిలో మీటర్ల ప్రయాణం
- మల్లేశ్‌కు అభినందనల వెల్లువ

బ్యాటరీతో నడిచే సైకిల్

సాంబారి మల్లేశ్

దండేపల్లి, జూన్ 4 : చదివింది పదోతరగతే అయినా తన ఆలోచనతో ఈ-సైకిల్ రూపొందించి అందరిచే శభాష్ అనిపించుకుంటున్నాడు మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన సాంబారి మల్లేశ్. ఇంజినీర్లకు తానేం తక్కువ కాదని నిరూపించాడు. బ్యాటరీ సైకిల్‌తో రోడ్డుపై రయ్.. రయ్‌మని ప్రయాణిస్తూ అందరిదృష్టిని ఆకర్షిస్తున్నాడు. గతంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేశాడు. అప్పట్లోనే పలు ఆవిష్కరణలు చేశాడు. సెల్‌ఫోన్ సాయంతో ఇంటి నుంచే వ్యవసాయ మోటర్లు ఆన్.. ఆఫ్ చేయడం, చప్పట్లతో వెలిగే కరెంటు బల్బులు తయారుచేయడం లాంటివి చేశాడు. అనంతరం బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లిన మల్లేశ్ సెలవులకు ఇంటికి వచ్చి నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాడు.

రెండు గంటలు చార్జిచేస్తే 30 కిలోమీటర్లు..

బ్యాటరీ సాయంతో నడిచే సైకిల్ తయారు చేయాలనే ఆలోచనతో మొదట రూ.5 వేలతో సైకిల్ కొనుగోలు చేశాడు. రూ.6 వేలతో పీఎండీసీ గేర్ మోటర్ కిట్, రూ.9 వేలతో 24వోల్టుల సామర్థ్యమున్న రీచార్జబుల్ బ్యాటరీని కొనుగోలు చేశాడు. మొత్తం రూ.20 వేల ఖర్చుతో బ్యాటరీ సైకిల్‌ను తయారు చేసి ఔరా అనిపించాడు. సుమారు 2 గంటల పాటు చార్జింగ్ పెడితే 30 కిలో మీటర్లపాటు 25 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేయవచ్చు. దారి మధ్యలో చార్జింగ్ అయిపోయినా సైకిల్‌లా తొక్కుతూ గమ్యం చేరుకోవచ్చు. ఈ సైకిల్ తయారు చేయడానికి కేవలం నెల రోజులు పట్టిందని మల్లేశ్ తెలిపాడు. కొన్ని పరికరాలు ఆన్‌లైన్‌లో తెప్పించినట్టు పేర్కొన్నాడు. ప్రస్తుత ట్రెండ్ అంతా ఎలక్ట్రిక్ వాహనాల చుట్టూ తిరగడం వల్లే ఈ-సైకిల్ తయారు చేశానని తెలిపాడు. కాలుష్యరహిత వాహనం తయారుచేసి పర్యావరణానికి మేలు చేస్తున్న తనకు ప్రభుత్వం సాయం చేస్తే మరిన్ని ఆవిష్కరణలు చేస్తానని చెబుతున్నాడు.